## నూతన రేషన్ కార్డులు ఎప్పుడిస్తారో చెప్పండి..

- సివిల్ సప్లయ్ కార్యాలయంలో బీఆర్ఎస్ నేతల వినతి

అబిడ్స్, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు మంజూరు చేస్తుందో స్పష్టత ఇవ్వాలని గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు ఎం. ఆనంద్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ప్రజా పాలన పేరుతో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించి ఏడాది గడిచినా నేటికీ ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడలోని సివిల్ సప్లై కమిషనర్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్ ఎంకే రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా పాలనలో స్వీకరించిన రేషన్‌కార్డుల దరఖాస్తులరె విచారణ చేయకుండానే మీసేవా కేంద్రాల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మీ సేవా కేంద్రాల్లో ప్రజలు గంటల తరబడి క్యూ లైన్‌లో నిల్చుని అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసిన వారందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జాంబాగ్ డివిజన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అహ్మద్, నరేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ హార్పిక్ బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

కాచిగూడ,ఫిబ్రవరి 14: ప్రజలను మభ్యపెడ్డి బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీ హార్పిక్ బాటిళ్లను అంటగట్టి డబ్బులు దండుకున్న వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు.

ఎస్సై హెచ్. నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక వెంకటేశ్వరనగర్‌కు చెందిన గౌతంచంద్(40) కొన్ని నెలలుగా బేగంబజార్ నుంచి నకిలీ వస్తువులను తెచ్చి నకిలీ హర్పిక్‌ను వెంకటేశ్వరనగర్‌లో తయారు చేస్తూ కాచిగూడలో విక్రయిస్తూ సోమ్ము చేసుకుంటున్నారు. సమాచా రం అందుకున్న పోలీసులు శుక్రవారం గౌతంచంద్‌ను అదుపులో తీసుకొని ఆతడి వద్ద 200 నకిలీ హర్పిక్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

# భవిష్యత్‌లో బీసీ విప్లవం తప్పదు..

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

ఆర్.కృష్ణయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గుజ్జ కృష్ణ, సంగీత తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 14: రాబోయే రోజుల్లో దేశంలో బీసీ విప్లవం తప్పదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెద్దిగారి సంగీతను నియమించారు. శుక్రవారం సంగీత ఆర్.కృష్ణయ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం జనాభా ధామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంట్‌లో రాజ్యంగ సవరణ చేయాలన్నారు. బీసీల సమస్యల పరిష్కారానికి తెలంగాణలో గ్రామగ్రామాన సమరభేరి కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ అట్రాసిటీ మాదిరిగా కేంద్రం బీసీ అట్రాసిటీని తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, అంజి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

కాచిగూడ,ఫిబ్రవరి 14: తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి గుట్టుచప్పుడు కాకుండా అధిక ధరలకు అమ్ముతున్న ముగ్గురిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హెచ్.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డా ప్రాంతానికి చెందిన పురుషోత్తం డాకే, భూదేశ్‌యాదవ్, మహ్మద్ క్వారాల్లా ముగ్గురు కలిసి పేదలు వద్ద తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొని ఎక్కువ ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు శుక్రవారం రాత్రి ముగ్గురు 3 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, ఫిబ్రవరి 14 : అంబర్‌పేటకు చెందిన ఇమ్మానుయేల్ అనారోగ్యం బారిన పడి ఇటీవల ఓ ప్రైవేటు దవాఖానాలో చికిత్సపొందాడు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆయనకు రూ. 25 వేల చెక్కు మంజూరైంది. శుక్రవారం ఆ చెక్కును ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గోల్నాక క్యాంప్ కార్యాలయంలో ఇమ్మానుయేల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఘనంగా శ్రీమాత కల్చరల్ ట్రస్ట్ ఆరంభ వేడుకలు

తెలుగుయూనివర్సిటీ, ఫిబ్రవరి 14 : శ్రీమాత కల్చరల్ ట్రస్ట్ సమారంభ వేడుకలు బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ప్రాచీన సనాతన ప్రేమకథ సీత పాత్రను ఆధారంగా చేసుకుని భానుమతి నరసింహన్ ఆంగ్లంలో సేతాయాణంను రచించగా దీని ఆధారంగా ప్రముఖ రచయిత బ్నిమ్ నవీకరణ చేసిన సీతాయణం కథను నృత్య రూపకంగా మలిచారు. వేదికపై పలువురు కళాకారులు ప్రదర్శించి రామాయణ ఘట్టాలను కళ్ల ముందు ఆవిష్కరింపజేశారు. ప్రముఖ నృత్య గురువు డాక్టర్ శోభానాయుడు శిష్యురాలు క్రాంతి నారాయణ్ తన శిష్య బృందంతో కలిసి అశోకవనంతో ప్రారంభించి సీత బాల్య సంఘటనలు, కళ్యాణ ఘట్టాలను, వనవాస విశేషాలు, రావణాపహరణ ఘటనను మధ్యలో స్పృశిస్తూ కమనీయంగా, రమణీయంగా సీతమ్మ రాముడి ప్రేమతత్వాన్ని ఆహూతులకు పరిచయం చేశారు. అనంతరం భగవద్గీత ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగాధర్ కళాకారులను సత్కరించారు.

## గుడిమల్కాపూర్ మార్కెట్‌లో అవకతవకలు

- మరుగుదొడ్ల కేటాయింపులో అక్రమాలు : బీఆర్ఎస్ నేత ఆరోపణ

కార్వాన్, ఫిబ్రవరి14 : గుడిమల్కాపూర్ మార్కెట్‌లో పెద్ద ఎత్తున అవకతవకలు జరుగతున్నట్లు బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దీపక్ ఆరోపించారు. ఇందిరాడ్డి పూల మార్కెట్‌లోని మరుగుదొడ్ల నిర్వహణ కేటాయింపులో మార్కెట్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరాడ్డి పూల మార్కెట్‌లోని మరుగుదొడ్ల నిర్వహణ కోసం కేటాయింపు ఏకపక్షంగా జరిగిందన్నారు. మార్కెట్ కార్యాలయంలో నోటీస్ బోర్డులోగాని, పత్రికా ప్రకటన గానీ ఇవ్వకుండా రహస్యంగా మార్కెట్ అధికారుల అనునాయులకు తక్కువ నెల అద్దెతో కేటాయించినట్లు పేర్కొన్నారు. మార్కెట్ కమిటీలో, మార్కెట్‌లోని దుకాణాలలో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. మార్కెట్ అధికారుల అవినీతిపై బీఆర్ఎస్ అధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు.

**మరుగుదొడ్ల టెండర్లలో నిబంధనలు పాటించాం..: మార్కెట్ కార్యదర్శి**

గుడిమల్కాపూర్ మార్కెట్‌లో మరుగుదొడ్ల నిర్వహణ కోసం తాము టెండర్ల ప్రక్రియలో పారదర్శకంగా వ్యవహరించాము. టెండర్ల విషయమై ఫిబ్రవరి 7న పత్రికా ప్రకటన ప్రచురించాం. కేవలం మూడు సీల్డు టెండర్లు రాగా అందులో అత్యధికంగా వచ్చిన టెండర్‌కు మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించాము. తమపై అనవసర అరోపణలు చేస్తున్నట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

## మార్కెట్ కార్యదర్శి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు..

- మార్కెట్ కమిటీ డైరెక్టర్ వసీం

కార్వాన్, ఫిబ్రవరి14 : గుడిమల్కాపూర్ మార్కెట్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, పాలక మండలి సభ్యులను పరిగణనలోకి తీసుకోకుండా మార్కెట్ కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని డైరెక్టర్ వసీం అరోపించారు. కమిటీ డైరెక్టర్లకు ఎలాంటి ప్రాధాన్యం లేదా? అని డైరెక్టర్ వసీం మార్కెట్ కార్యదర్శిని, అధికారులను ప్రశ్నిస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో మార్కెట్ అధికారులతో పాటు మార్కెట్ పాలక మండలి సభ్యులను కూడా హైరానాకు గురి చేసింది. మూడు రోజుల క్రితం మార్కెట్‌లో బాత్రూం టెండర్ల కేటాయింపులో మార్కెట్ కార్యదర్శి చైర్మన్‌తో సంతకం చేయించి తక్కువ ధరకు కేటాయించడం ప్రశ్నించారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి నెలకు రూ.18,500 నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మార్కెట్ కార్యాలయం నిర్వహణకు నెలకు రూ. 9 లక్షలు ఎలా అవుతాయని ఆయన ప్రశ్నించారు. మార్కెట్ కార్యదర్శి నిర్ణయాలు తీసుకునే సమయంలో డైరెక్టర్లుగా ఉన్న తమను సంప్రదించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని డైరెక్టర్ వసీం ప్రశ్నించారు. మార్కెట్‌లో అక్రమాలను త్వరలోనే బయటపెడతానని అన్నారు. మార్కెట్ చైర్మన్ సైతం తమను సంప్రదించి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## సహజ వనరులను సంరక్షించుకోవాలి

సాక్షం లోగోను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తదితరులు

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెలుగు యూనివర్సిటీ, ఫిబ్రవరి 14 : సహజ వనరులను సంరక్షించుకుంటూనే పొదుపుగా వాడుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్తాధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో శుక్రవారం 'ఇంధన సంరక్షణ-స్థిరమైన ఇంధన పద్ధతులపై జరిగిన కార్యక్రమంలో సాక్షం-2025 లోగోను గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థిరమైన వాతావరణాన్ని నిర్ధారించడానికి క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ ఆవశ్యకతను బలపరిచే సాక్షం లక్ష్యాన్ని ప్రశంసించారు. పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంభించడానికి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. వాతావరణ మార్పులను తగ్గించడంలో స్థిరమైన ఇంధన భవిష్యత్‌ను సంరక్షించడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఇంధనశాఖ అధికారులు అనిల్‌కుమార్, పీయూష్ మిట్టల్, బెన్నీథామస్, నితిన్‌సెల్కర్, దేవకాంత్ సిన్హా, యతేంద్రపాల్, తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య నిత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీహెచ్‌డీ కోర్స్ వర్క్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23, 2023-24 బ్యాచ్‌లకు చెందిన బ్యాక్లాగ్ అభ్యర్థులు తమ పరీక్ష ఫీజును వచ్చే నెల 12వ తేదీ లోగా సంబంధిత డీన్ కార్యాలయంలో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

### వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లమా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి

సమావేశంలో పాల్గొన్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 14 : ఎన్నికల్లో వాగ్దానం చేసిన మేరకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 15% నిధులు విద్యకు కేటాయించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. శుక్రవారం భోజగుట్టలో జరిగిన ఆసిఫ్‌నగర్ మండల కమిటీ సమావేశానికి హైదరాబాద్ జిల్లా కన్వీనర్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేసి విద్యా హక్కు ప్రకారం కేంద్రీయ విద్యాలయాల సమానాలో ఉపాధ్యాయులను నియమించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఆసిఫ్ నగర్ మండల కన్వీనర్లు సీహెచ్ వెంకట స్వామి, జి.బాలయ్య మాణిక్యం, భోజగుట్ట, శివాజీనగర్ బస్తీ నాయకులు రవి, బాలస్వామి, నరసింహ, టీచర్ నాగలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు,బస్తీ వాసులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆటోకు సౌండ్‌బాక్స్‌ను తొలగిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏఎస్సై, సిబ్బంది

కాచిగూడ,ఫిబ్రవరి 14: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ట్రాఫిక్ సీఐ ఆధ్వర్యంలో నింబోలిఅడ్డాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అధిక సౌండ్ బాక్స్ కలిగిన వాహనాల డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. త్రీ, ఫోర్‌వీలర్ వాహనాల్లో పరిమితికి మించి సౌండ్ ఉండరాదని, అధిక సౌండ్ చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్సై అనిల్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రేమ్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

గోల్నాక ,ఫిబ్రవరి 14 : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సూచించారు. డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హబీబ్‌నగర్ నాలా అభివృద్ధికి చర్యలు చేపట్టండి..

మెహిదీపట్నం ఫిబ్రవరి 14 : నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లోని హబీబ్‌నగర్ నాలా అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్ ఖాన్ అధికారులను కోరారు. శుక్రవారం సాయంత్రం ఆయన జీహెచ్ఎంసీ ఇంజినీర్ ఇన్ చీఫ్ భాస్కర్‌రెడ్డిని కలిశారు. హబీబ్‌నగర్ నాలాలో పూడికతీత పనులు, ప్రహరీ నిర్మాణం తదితర పనులపై చర్చించారు. స్పందించిన ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి సంబంధిత అధికారులకు పనులను చేపట్టాలని ఆదేశిస్తానని తెలిపారు.

## వైభవంగా రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

జియగూడ, ఫిబ్రవరి 14 : డివిజన్ పరిధిలోని ఇమాంపురలో బొడ్రాయి నాభిశిల, శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ ప్రథమ వార్షిక వేడుకలు నవ భారత్ సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బొడ్రాయికి, అమ్మవారికి అభిషేకం, మహా హారతి నిర్వహించారు. అనంతరం మహాయజ్ఞం గావించారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు జి.వినయ్‌కుమార్, వై జస్వంత్‌కుమార్, మహేశ్‌బాబు, బాలకిషన్, సంతోష్‌కుమార్, లక్ష్మీనారాయణ, వీ. నర్సింగ్‌రావు, సి.నర్సింగ్‌రావు, బాబు, శ్రీకాంత్, దర్శన్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌పై అభ్యంతర పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ట్విట్టర్ వేదికగా పోస్టులు చేసిన మొదుంపల్లి సాయినాథ్‌పై సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కైలాశ్ సజ్జన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రూ. 10వేలు, ఇద్దరి పూచీకత్తు సమర్పించాలని 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది. సెక్షన్లన్నీ కూడా ఏడేండ్లలోపు శిక్షలు అమలు చేసేవేనని, బీఎన్ఎస్ఎస్ 35(3) కింద నోటీసులు జారీ చేయాలని న్యాయవాది లక్ష్మణ్ కోర్టుకు వాదనలు వినిపించారు. న్యాయవాది వాదనలను ఏకీభవించిన కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించకుండా బెయిల్ మంజూరు చేసింది. ముఖ్యమంత్రిపై అసభ్యకర పదజాలంతో దూషించాడని, ట్విట్టర్ పేజీని సాక్షాధారంగా జత చేసినట్టు పీపీ కోర్టుకు తెలిపినప్పటికీ తోసిపుచ్చింది. విచారణాధికారికి సహకరించాలని, కోర్టుకు విధిగా హాజరుకావాలని సూచించింది.

## తాగునీటి కోసం ఘర్షణ.. కత్తితో దాడి

కార్వాన్, ఫిబ్రవరి14 : గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఓ వ్యక్తిపై కత్తితో దాడి జరిగింది. ఇన్‌స్పెక్టర్ బైరి రాజు తెలిపిన వివరాల ప్రకారం .. మెహిదీపట్నంలోని ఓ నిర్మాణ భవనంలో పలువురు కార్మికులు ఆశ్రయం పొందుతున్నారు. మహారాష్ట్ర అకోలా ప్రాంతానికి చెందిన సమద్ అన్సారీ(28) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఇదే భవనంలో బీహార్‌కు చెందిన సయ్యద్ అమీన్(22)ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరిద్దరూ ఒకరినొకరు బాగా పరిచయం ఉన్న వ్యక్తులే. కాగా గురువారం రాత్రి వీరు ఉంటున్న గదిలో తాగునీటి కోసం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దాంతో ఆగ్రహావేశానికి లోనైన సయ్యద్ అమీన్ గదిలోని కూరగాయాల కత్తితో అన్సారీ కడుపులో పొడిచాడు. అన్సారీకి తీవ్ర గాయాలు కాగా సమాచారం అందుకున్న గుడిమల్కాపూర్ పోలీసులు బాధితుడిని స్థానిక ప్రైవేటు దవాఖానాకు తరలించారు. దాడికి పాల్పడిన అమీన్‌ను అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పుల్వామా అమర వీరులకు ఘన నివాళి

రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అంబర్‌పేట, ఫిబ్రవరి 14 : పుల్వామా దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీర జనాన్లకు శుక్రవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో భరత్‌నగర్ యూత్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎడెల్లి బాలు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ అజయ్‌కుమార్ హాజరయ్యారు. ముష్కరుల దాడిలో వీరమరణం పొందిన వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సీ. కృష్ణగౌడ్, అమరేందర్, ఈఎస్ ధనుంజయ, పీ గోవర్ధన్‌రెడ్డి, చుక్కా జగన్, భాస్కర్, యశ్వంత్, ప్రవీణ్‌కుమార్, సాయిఠాకూర్, రఘుచారి, ముఖేశ్‌గౌడ్, సాయిచరణ్, అనిల్‌కుమార్, సీహెచ్ హరీశ్, సాయిరాజ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

**నిజాం కళాశాలలో..**

సుల్తాన్‌బజార్ : దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన వీర సైనికులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం నిజాం కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 2019 ఫిబ్రవరి 14న ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన వీర సైనికుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం సైనికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడుతున్నారని, వారిని స్మరించుకోవడం మన కర్తవ్యమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ ఆఫీసర్ నవీన్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు

మెహిదీపట్నంలో అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న నాయకులు

సుల్తాన్‌బజార్ : నిజాం కళాశాలలో అమర సైనికులకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్, ఎన్‌సీసీ విద్యార్థులు

**అమరవీరులకు నివాళి**

మెహిదీపట్నం : పుల్వామా ఉగ్ర దాడిలో మరణించిన 40 మంది అమరవీరులకు శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద బీజేపీ లంగర్‌హౌస్ డివిజన్ అధ్యక్షుడు దుమ్మటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో నితీశ్‌రెడ్డి, రాజేశ్‌యాదవ్, ఇంద్రసేనారెడ్డి, నాగేంద్ర ప్రకాశ్‌రెడ్డి, శ్రీకాంత్, పాండుకుమార్, భాస్కర్, ప్రవంత్, సుధీర్ యాదవ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాలకు దూరంగా ఉండాలి

కీసర, ఫిబ్రవరి 14:ఆన్‌లైన్‌లో జరిగే ఆర్థిక మోసాలకు దూరంగా ఉండాలని ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చీర్యాల్ గ్రామంలో చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌పై పోలీసులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..ఆన్‌లైన్‌లో జరిగే ఆర్థిక మోసాలకు చాలా మంది గురవుతున్నారని, బాధితులు ఆలస్యం చేయకుండా 1930కి కాల్ చేయాలని సూచించారు. తదితర నేరాలపై యూత్ వారికి వివరించారు. కార్యక్రమంలో నేతలు కోల కృష్ణయాదవ్, మాజీ సర్పంచ్ తుంగ ధర్మేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బీ ఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీలోని బీఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) 3, 5, 7 సెమిస్టర్ల మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 20వ తేదీ వరకు సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చని చెప్పారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం ఫిబ్రవరి 14 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్ డివిజన్‌లోని పలు ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి 11:00 గంటల వరకు అమీనా మసీద్, పారామాం కాలనీ గేట్ నెంబర్ 2,4 ప్రాంతాలు, ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు సక్కుబాయి కాలనీ, షేక్‌పేట్‌లోని కొంత ప్రాంతం, ఓయూ కాలనీ, వీబీఆర్ఐ, నైస్ హాస్పిటల్ ఐటీఐ మల్లేపల్లి,ఏ బ్యాటరీ లైన్, జయనగర్